క్లుప్తంగా

బీఆర్ఎస్ ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కోరారు. జిల్లా కేంద్రంలోని 16వ వార్డు, ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఏరియాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ, దుకాణాలకు వెళ్లి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు గాదె సత్యం, అంకం నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

నస్పూర్‌లో బీఆర్ఎస్ ప్రచారం

నస్పూర్: పట్టణంలోని 24, 25వార్డుల్లో ఆదివారం బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.కొప్పుల ఈశ్వర్‌కు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్య, కౌన్సిలర్లు తిరుపతి, అన్నపూర్ణ, బేర సత్యనారాయణ, నాయకులు మెరుగు పవన్‌కుమార్, పానుగంటి సత్తయ్య, గరిశె రామస్వామి, రాజేంద్రపాణి, బండి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

జన్నారం: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపునకు బీఆర్ఎస్ కార్యకర్తలు కృషి చేయాలని ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలోని దేవునిగూడ, కామన్‌పల్లి గ్రామాలకు చెందిన పలువురు నాయకులు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో కామన్‌పల్లి మాజీ సర్పంచ్ మానస, యూత్ అధ్యక్షుడు పేరం శ్రీనివాస్, మండల నాయకులు ఫజల్ ఖాన్, భరత్‌కుమార్, శ్రీనివాస్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం మొక్కలు తొలగించరా?



భీమారం: మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారి పక్కనే భీమారం బస్టాప్ వద్ద గల ఊరచెరువులో పాలసముద్రం మొక్కలు పెరిగినా వాటిని తొలగించే పనులు చేపట్టడం లేదు. పదిహేనేళ్ల నుంచి పాలసముద్రం మొక్కలు చెరువును ఆక్రమిస్తున్నాయి. అయితే వీటిని తొలగించేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ విప్‌గా పనిచేసిన చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చెరువును సందర్శించి జాతీయ రహదారి పక్కనే గల చెరువును తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. రూ.3 కోట్లతో మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేస్తానని చెప్పినా అది అమలు కాలేదు. ఈ వేసవిలో ఉపాధిహామీ పథకం ద్వారానైనా కనీసం మొక్కలు తొలగించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

'మాకు న్యాయం చేయండి'



మాట్లాడుతున్న సల్వాజి గంగలక్ష్మి

జన్నారం: తను కొనుగోలు చేసిన భూమిని పొనకల్‌కు చెందిన వ్యక్తి అక్రమంగా తన పేరుమీద పట్టా చేయించుకుని ఆక్రమించుకోవాలని చూస్తున్నాడని, అధికారులు తనకు న్యాయం చేయాలని జన్నారం మండలం అక్కపెల్లి గూడకు చెందిన సల్వాజి గంగలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం తన గోడును విలేకరులకు విన్నవించారు. 40 సంవత్సరాలుగా కాస్తులో ఉన్న మమ్ములను తన అనుచరులతో బెదిరిస్తున్నాడని, దాడికి పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, వారిపై కేసు కూడా నమోదైందని తెలిపారు. తమను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తూ మా భూమిని అక్రమంగా తీసుకోవాలని ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయంపై రెవెన్యూ, పోలీసు అధికారులు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

షెడ్లు ప్రారంభం

జన్నారం: మండలంలోని కవ్వాల్ పోచమ్మ తల్లి ఆలయం వద్ద మతాలకు అతీతంగా గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో షెడ్ల నిర్మాణం చేశారు. ప్రతీ వారంలో ఆది, గురు వారాలు అత్యధిక సంఖ్యలో భక్తులు పోచమ్మ ఆలయానికి వస్తున్నందునా, సౌకర్యాలు లేని ఆ ప్రాంతంలో గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో షెడ్ల నిర్మానం చేసి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో తెలంగాణ గల్ఫ్ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిండెంట్ అమరగొండ తిరుపతిగౌడ్, జిల్లా, మండల నాయకులు అక్రమ్ ఖాన్, పర్కాల మహేశ్, రాజలింగు, లచ్చన్న, నరేశ్ పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులకు వేళాయె..!

• ప్రభుత్వ, ప్రైవేటు ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలు • వేసవి సెలవుల్లో కొత్త అంశాలను నేర్చుకునే అవకాశం • సద్వినియోగం చేసుకుంటే మేలు



మంచిర్యాలటౌన్: విద్యార్థులకు వేసవి సెలవులు ప్రారంభం కావడంతో ఆ సెలవులను చిన్నారులు సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వ పరంగా ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభించారు. కొందరు ప్రైవేటుగా కూడా నెల ఫీజులతో సమ్మర్ క్యాంపుల పేరిట వివిధ రకాల క్రీడలు, నృత్యం, జ్ఞాపకశక్తి పెంపొందించే వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఖేలో ఇండియా ఆధ్వర్యంలో ఉచిత బాక్సింగ్ శిక్షణ, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత క్రికెట్ శిక్షణను ప్రారంభించారు. మే 1వ తేదీ నుంచి జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్ గేమ్స్, వాలీబాల్, కరాటే, బాక్సింగ్, తైక్వాండో, కబడ్డీ, బ్యాడ్మింటన్‌లలో ఉచిత శిక్షణను ప్రారంభించనున్నారు.

29 నుంచి ఉచిత బ్యాడ్మింటన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ నుంచి మే 12వ తేదీ వరకు ఉచిత బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరాన్ని మంచిర్యాల పట్టణంలోని రంగంపేట్ గ్రీన్‌సిటీలో మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీ(రూబీ)లో ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి 8:30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 9849505695, 9949942952, 9959977929 నంబర్లలో సంప్రదించాలని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్ తెలిపారు.

ఖేలో ఇండియా ద్వారా ఉచిత బాక్సింగ్

జిల్లాలోని 10 నుంచి 20 ఏళ్ల వరకు గల బాలబాలికలకు జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఖేలో ఇండియా బాక్సింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఉచితంగా శిక్షణను కోచ్ సీహెచ్. రాజేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఉదయం 6 నుంచి 9గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. శిక్షణకు హాజరు కావాలనుకునే వారు షూస్, టీ-షర్ట్స్, క్రీడా దుస్తులు, స్పోర్ట్స్ కిట్‌తో హాజరు కావచ్చని, ఇతర వివరాలకు 9963539234లో సంప్రదించి, శిక్షణ పొందవచ్చు.

ఉచిత క్రికెట్ శిక్షణ



హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని విద్యార్థులకు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా ఉచితంగా క్రికెట్ శిక్షణను జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలోని హెచ్‌సీఏ క్రికెట్ అకాడమీలో అందిస్తున్నారు. ఈ నెల 25వ తేదీన ఈ శిక్షణను ప్రారంభించగా, నెల రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇప్పటికే 100 మంది విద్యార్థులు శిక్షణలో చేరినట్లు హెచ్‌సీఏ కోచ్ ప్రదీప్ తెలిపారు. శిక్షణలో చేరేందుకు 9440010696 నంబరులో సంప్రదించాలని కోచ్ తెలిపారు.

కిడ్స్ సమ్మర్ క్యాంపు



జిల్లా కేంద్రంలోని ఫైర్ స్టేషన్ వద్ద గల సెవెన్ హిల్స్ హైస్కూల్‌లో సింగింగ్, డ్యాన్సింగ్, కరాటే, కర్రసాము, డ్రాయింగ్‌లను ఉదయం 7 నుంచి 9 గంటల వరకు శిక్షణను ఇవ్వనున్నారు. వివరాలకు 9849562322, 9014029466, 9177581404 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరుతున్నారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఒక్కోదానికి రూ. 400లు, రెండు అంశాలకు రూ. 800లు, మూడు అంశాలకు గాను రూ. 1000ల ఫీజు కాగా, 6 నుంచి 10వ తరగతి వరకు ఒక్కో అంశంకు రూ. 500లు, రెండింటికి రూ. 900లు, మూడింటికి రూ. 1,200ల ఫీజును తీసుకోనుండగా, ఈ క్యాంపును మే 1వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

ప్రజ్ఞా సమ్మర్ క్యాంపు

వికాస తరంగిణి మంచిర్యాల వారి ఆధ్వర్యంలో మే 10వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ప్రజ్ఞా సమ్మర్ క్యాంపును విద్యార్థుల కోసం నిర్వహిస్తున్నారు. 4వ తరగతి నుంచి 9వ తరగతి చదువుతున్న బాల బాలికలకు వారి జీవితంలో ఉపయోగపడే నైపుణ్యాలు, అలవాట్లను పెంపొందించేందుకు గాను వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇతర వివరాలకు జెట్ భవనము, చెన్నూరు గేట్ దగ్గర, వికాస తరంగిణి, మంచిర్యాలలో సంప్రదించాలని, 9440005033, 9849383080, 9949594284 నంబర్లలో సంప్రదించవచ్చునని, 12 రోజుల క్యాంపునకు గాను రూ. 1,500ల ఫీజు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

క్రియేటివ్ కిడ్స్ సమ్మర్ క్యాంపు

మంచిర్యాల పట్టణంలోని హైటెక్‌సిటీ కాలనీలోని మైత్రి యోగ, ప్రకృతి క్యూర్ సెంటర్ ఆధ్వర్యంలో 5 నుంచి 15 ఏళ్ల వయస్సు గల విద్యార్థులకు 15 రోజుల సమ్మర్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నారు. ఈ నెల 26 నుంచి మే 12వ తేదీ వరకు, మే 17 నుంచి 2 జూన్ వరకు రెండు బ్యాచ్‌లను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఏసీ హాల్‌లో నిర్వహిస్తూ, రూ. 2,500ల ఫీజును తీసుకుంటున్నారు. ఫిజికల్ స్ట్రెంత్, స్టామినా, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపొందించుకోవడం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, మోరల్ వాల్యూస్, సెల్ఫ్ డిసిప్లైన్, కేరింగ్, షేరింగ్, రెస్పాన్సిబిలిటీ, హెల్తీ లైఫ్ స్టైల్, ఎమోషనల్ బ్యాలన్స్, టైమ్ మేనేజ్‌మెంట్, యోగ, బ్రీత్ వర్క్, మ్యూజిక్ డ్యాన్స్, ఇండోర్, ఔట్‌డోర్ గేమ్స్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ వంటివి ఇందులో నేర్పిస్తున్నారు. వివరాలకు 9652227079, 08736-251155 నంబరులో సంప్రదించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వివేక్

మందమర్రిరూరల్: మండలంలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు కుమ్మరి తిరుపతి కాంగ్రెస్‌లో చేరారు. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆదివారం ఆయనకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నీలయ్య, నాయకులు శీలం చిన్నయ్య, కొట్టె సంపత్, కనకం వెంకటేశ్వర్లు, సంతోష్ తదితరులు ఉన్నారు.

'ఆత్రం సుగుణను గెలిపించండి'

జన్నారం: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరుతూ ఆదివారం జన్నారం మండలం చర్లపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల గురించి వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు గొర్రె మహేశ్, నాయకులు పర్కాల తిరుపతిగౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే వివాహ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావ్-సురేఖ

మంచిర్యాలక్రైం: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావ్, సురేఖ దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని ఆదివారం ఆయన నివాసంలో కార్యకర్తలు, అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

అంబలి పంపిణీ ప్రారంభం

మంచిర్యాలక్రైం/నస్పూర్/లక్సెట్టిపేట: కొక్కిరాల రఘుపతిరావు చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా, బస్టాండ్, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో, శ్రీరాంపూర్, నస్పూర్ సీసీసీ కార్నర్ వద్ద, లక్సెట్టిపేటలో ఆదివారం ఉచిత అంబలి, చలివేంద్రాల పంపిణీ కేంద్రాలను ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి సత్యపాల్‌రావు-రుక్మిణి ప్రారంభించారు.

ఇంటర్‌లో సత్తాచాటిన విద్యార్థులకు సన్మానం



తాండూర్: శృతిని సత్కరిస్తున్న నాయకులు



సాయిజను సత్కరిస్తున్న గ్రామస్తులు



జన్నారం: శ్రీవల్లిని అభినందిస్తున్న జెడ్పీటీసీ

తాండూర్/చెన్నూర్‌రూరల్/జన్నారం: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులను ఆయా మండలాల నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు. తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్‌కు చెందిన ఇందూరి శృతి 370 మార్కులకు గాను 368మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించింది కాగా శృతిని, ఆమె తల్లిదండ్రులను మున్నూర్ కాపు సంఘం నాయకులు శాలువా కప్పి సత్కరించారు. చెన్నూర్ మండలం పొక్కూరుకు చెందిన చీర్ల దివాకర్, సునీతల కుమార్తె చీర్ల సాయిజ 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలవగా గ్రామస్తులు అభినందించారు. జన్నారం మండలానికి చెందిన శ్రీవల్లి రాష్ట్రస్థాయిలో ఎనిమిదో ర్యాంకు సాధించింది. కాగా జెడ్పీటీసీ, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు సన్మానం చేశారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

• ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పార్లమెంట్ ఎన్నికల్లో భారీ విజయం సాధించి కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. హాజీపూర్ మండలంలోని వేంపల్లి, ముల్కల్ల గ్రామాల్లో ఆదివారం ఇంటింటా తిరుగుతూ చేతి గుర్తుకు ఓటు వేసి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కోరారు. ఎంపీ ల్యాండ్స్ నిధులతో హాజీపూర్ మండలంలోని గ్రామాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దండేపల్లిలో....



అ'పూర్వ' సమ్మేళనం



మందమర్రిలో కలుసుకున్న పూర్వవిద్యార్థులు

దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2006-07 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకొన్నారు. పదోతరగతి తరువాత ఉన్నత చదువుల నిమిత్తం విడిపోయిన వారు, మళ్లీ 18ఏళ్లకు ఒకే చోట కలుసుకుని, తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో గల అరుణోదయ పాఠశాలలో 2000-01వ సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 24 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన వారు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని గత స్మృతులు జ్ఞాపకం చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువా కప్పి సన్మానించారు. అనంతరం అందరూ కలిసి ఒకచోట భోజనాలు చేసి రోజంతా సంతోషంగా గడిపారు.

మూలమలుపు ప్రమాదకరం..!



మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని రామన్‌కాలనీ వద్ద కేకే1 గని సమీపంలో రైల్వే ట్రాక్‌పై నిర్మించిన కోల్‌బెల్ట్ రహదారిపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి వర్క్‌షాపు మూల మలుపు ప్రమాదకరంగా ఉంది. ఆదమరిస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, ఓవర్ బ్రిడ్జిపై విద్యుత్ సౌకర్యం కల్పించాలని, సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. రైల్వేట్రాక్‌పై సుమారు 45-50 సంవత్సరాల క్రితం నిర్మించిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి చాలా బలహీనంగా మారడంతో దాని పక్కనే నూతన ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. కొత్త బ్రిడ్జిపై వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, పాత బ్రిడ్జిపై రాకపోకలు జరగకుండా అధికారులు రోడ్డును కట్ చేశారు. రోడ్డు కట్ చేసిన విషయం కొంతమంది వాహనదారులకు తెలియకపోవడంతో అక్కడి వరకు వెళ్లి వెనుదిరుగుతున్నారు. అధికారులు రోడ్డు క్లోజ్ అనే బోర్డు పెట్టినట్లైతే వాహనదారులు అలా వెళ్లే అవకాశం ఉండదని వాహనదారులు పేర్కొంటున్నారు.

ఆకట్టుకుంటున్న గొల్లవాగు అందాలు





భీమారం మండల కేంద్రానికి సమీపంలోని గొల్లవాగు ప్రాజెక్ట్‌లోని నీటిలో ఎండిన చెట్లు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ప్రాజెక్ట్‌లో నీటి మట్టం గణనీయంగా తగ్గిపోవడంతో, కొన్నిరోజుల నుంచి వివిధ రకాల చెట్లు దర్శనమిస్తున్నాయి.

– భీమారం

వాలీబాల్ కిట్లు పంపిణీ

భీమిని: మండల కేంద్రంలోని యువతకు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా శనివారం రాత్రి ఎస్సై విజయ్‌కుమార్ వాలీబాల్ కిట్లు అందజేశారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు.